www.aksharadarbar.com
మంగళవారం 30, ఏప్రిల్ 2024
అక్షర దర్బార్
voice of the people
తెలుగు దినపత్రిక వరంగల్ | సంచిక :74 | సంపుటి :02 | పేజీలు : 04 | వెల : 05

దళిత, ఓబీసీల రిజర్వేషన్లు రద్దు చేసే ప్రసక్తే లేదు

- మార్ఫింగ్ వీడియో చేసిన వారిని వదిలేది లేదు
- ఓటమి భయంతోనే కాంగ్రెస్ కుట్రలు
- ప్రధాని నరేంద్ర మోడీ

04

రిజర్వేషన్ల రద్దుకు

బీజేపీ కుట్ర

- ఔటర్ రింగ్ రోడ్డు, ఎయిర్ పోర్టు రాకుండా అడ్డుకున్నది మోడీనే
- విభజన హామీలు ప్రస్తావించినందుకే నాపై అక్రమ కేసులకు యత్నం
- గుజరాత్ పెత్తనమా.. తెలంగాణ పౌరుషమా తేల్చుకుందాం..
- బీఆర్ఎస్ కు ఓటేస్తే మురిగిపోతుంది
- రేగొండ జన జాతర సభలో సీఎం రేవంత్ రెడ్డి

04

కేంద్రంలోని బీజేపీ ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ రిజర్వేషన్లు రద్దు చేసేందుకు కుట్ర చేస్తున్నదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆరోపించారు. వరంగల్ ఔటర్ రింగ్ రోడ్డు, ఎయిర్ పోర్ట్ రాకుండా ప్రధాని మోడీ అడ్డుకున్నారని, రాష్ట్ర విభజన హామీల గురించి అడిగితే తనపై అక్రమ కేసులు పెట్టాలని చూస్తున్నారని సీఎం ధ్వజమెత్తారు. లోకసభ ఎన్నికల ప్రచారంలో భాగంగా భూపాలపల్లి నియోజకవర్గం రేగొండలో మంగళవారం నిర్వహించిన జనజాతర సభలో ముఖ్యమంత్రి బీజేపీ, బీఆర్ఎస్ పై ఆగ్రహం వ్యక్తం చేశారు. రిజర్వేషన్ల రద్దు కోసమే 400సీట్లలో గెలిపించాలని బీజేపీ అడుగుతున్నదన్నారు. విభజన అంశాలు, వరంగల్ కు ఎయిర్ పోర్టు, ఔటర్ రింగ్ రోడ్డు ప్రస్తావించినందుకు అక్రమ కేసులు పెట్టడానికి కాషాయ దళం ప్రయత్నాలు మొదలు పెట్టిందని, అందులో భాగంగానే గాంధీ భవన్ కు మోడీ, అమిత్ షా ఢిల్లీ పోలీసులను పంపించారని.. రేవంత్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. గుజరాత్ పెత్తనమా.. తెలంగాణ పౌరుషమా తేల్చుకుందామని సవాల్ విసిరారు.

– అక్షర దర్బార్, వరంగల్ ప్రతినిధి



కడియం.. దళిత ద్రోహి

- వారి హక్కులను కబ్జా చేశాడు
- ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే నాలుక చీల్చుతం
- ప్రజలకు అందుబాటులో ఉండాలనే గెస్ట్ హౌస్ లు
- భూ కబ్జాదారుడిని అయితే నాపై పిటిషన్లు రావాలి కదా
- కాంగ్రెస్ హామీలను నమ్మే స్థితిలో ప్రజలు లేరు
- మోడీ మూడోసారి ప్రధాని కావడం, వరంగల్లో బీజేపీ జెండా ఎగరటం ఖాయం
- 'అక్షర దర్బార్' ఇంటర్వ్యూలో వరంగల్ పార్లమెంటు నియోజకవర్గం బీజేపీ అభ్యర్థి అరూరి రమేశ్

'కబ్జాదారు కడియం శ్రీహరి. ఆయన తెలుగుదేశం పార్టీలో ఉన్నప్పుడు దళితుల హక్కులను కబ్జా చేసిండు. ఆ తర్వాత బీఆర్ఎస్ పార్టీలో అదే పని చేసిండు. ఇప్పుడు కాంగ్రెస్ పార్టీలో కూడా మొదలు పెట్టిండు. అతను దళిత ద్రోహి. అంతేకాదు వెన్నుపోటు దారు. టీడీపీలో ఎన్టీఆర్ వంటి నేతలకు వెన్నుపోటు పోడవటమే కాకుండా కేసీఆర్ ను వెన్నుపోటు పొడిచాడు. బీఆర్ఎస్ పార్టీలో తన కూతురుకు ఆ పార్టీ నుంచి టికెట్ తీసుకున్న తర్వాత మోసం చేసిండు. బీఆర్ఎస్ ను వదిలి కాంగ్రెస్ లో చేరాడు. ఆయన నాపై భూ కబ్జాదారుడు, దోపిడిదారుడని చేస్తున్న ఆరోపణల్లో నిజం లేదు. నోరు ఉంది కదా ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే నాలుక చీల్చుతం' అని వరంగల్ పార్లమెంటు నియోజకవర్గం బీజేపీ అభ్యర్థి అరూరి రమేష్ అన్నారు. మేము వ్యాపారులం. మరి ఏ వ్యాపారం లేని కడియం శ్రీహరి రూ.కోట్ల ఆస్తులు ఎలా కూడపెట్టారని ఆయన ప్రశ్నించారు. వరంగల్ పార్లమెంటు స్థానం నుంచి బీజేపీ అభ్యర్థిగా బరిలో నిలిచిన మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్ మంగళవారం 'అక్షర దర్బార్' తో మాట్లాడారు.

02

- అక్షర దర్బార్,
వరంగల్ ప్రతినిధి

స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎన్నికల నిర్వహణ

రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ పి. ప్రావీణ్య

02

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి

స్కూటీని ఢీకొన్న గుర్తు తెలియని వాహనం

04

కబ్జాదారు కడియం!

- దళితుల హక్కులను కబ్జా చేశాడు
- దళిత ద్రోహి.. వెన్నుపోటుదారు.. మోసకారి
- ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే నాలుక చీల్చుతం
- ప్రజలకు అందుబాటులో ఉండాలనే గెస్ట్ హౌస్ లు
- భూ కబ్జాదారుడిని అయితే నాపై పిటిషన్లు రావాలి కదా
- కాంగ్రెస్ హామీలను నమ్మే స్థితిలో ప్రజలు లేరు
- మోడీ మూడోసారి ప్రధాని కావడం, వరంగల్లో బీజేపీ జెండా ఎగరటం ఖాయం
- 'అక్షర దర్బార్' ఇంటర్వ్యూలో వరంగల్ పార్లమెంటు బీజేపీ అభ్యర్థి అరూరి రమేష్

అక్షర దర్బార్, వరంగల్ ప్రతినిధి:

కబ్జాదారు కడియం శ్రీహరి. ఆయన తెలుగుదేశం పార్టీలో ఉన్నప్పుడు దళితుల హక్కులను కబ్జా చేసిండు. ఆ తర్వాత బీఆర్ఎస్ పార్టీలో అదే పని చేసిండు. ఇప్పుడు కాంగ్రెస్ పార్టీలో కూడా మొదలు పెట్టిండు. అతను దళిత ద్రోహి. అంతేకాదు వెన్నుపోటు దారు. టీడీపీలో ఎన్టీఆర్ వంటి నేతలకు వెన్నుపోటు పొడవటమే కాకుండా కేసీఆర్ ను వెన్నుపోటు పొడిచాడు. బీఆర్ఎస్ పార్టీలో తన కూతురుకు ఆ పార్టీ నుంచి టికెట్ తీసుకున్న తర్వాత మోసం చేసిండు. బీఆర్ఎస్ ను వదిలి కాంగ్రెస్ లో చేరాడు. ఆయన నాపై భూ కబ్జాదారుడు, దోపిడిదారుడని చేస్తున్న ఆరోపణల్లో నిజం లేదు. నోరు ఉంది కదా ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే నాలుక చీల్చుతం అని వరంగల్ పార్లమెంటు నియోజకవర్గం బీజేపీ అభ్యర్థి అరూరి రమేష్ అన్నారు. మేము వ్యాపారులం. మరి ఏ వ్యాపారం లేని కడియం శ్రీహరి రూ.కోట్ల ఆస్తులు ఎలా కూడపెట్టారని ఆయన ప్రశ్నించారు. వరంగల్ పార్లమెంటు స్థానం నుంచి బీజేపీ అభ్యర్థిగా బరిలో నిలిచిన మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్ మంగళవారం 'అక్షర దర్బార్' తో మాట్లాడారు. ఆయన ఇంటర్వ్యూ విశేషాలు...

అక్షర దర్బార్: అరూరి భూకబ్జాదారుడు. వరంగల్ నగరం చుట్టూ ఆయనకు వందల ఎకరాలు ఉన్నాయని కాంగ్రెస్ పార్టీకి చెందిన స్టేషన్ గణపురం ఎమ్మెల్యే కడియం శ్రీహరి అంటున్నారు. దీనిపై మీరేమంటారు?

ఆరూరి: కబ్జాదారును నేను కాదు. కడియం శ్రీహరి. టీడీపీలో ఉన్నప్పుడు దళితుల హక్కులను కబ్జా చేసిండు. బీఆర్ఎస్ లో అదే చేసిండు. ఇప్పుడు కాంగ్రెస్ లో దళితుల హక్కులను కబ్జా చేయడం మొదలు పెట్టిండు. కడియం కబ్జాదారుడు. నేను భూములను కబ్జా చేస్తే ఎవరు ఊర్కుంటరు. ఇప్పుడు అధికారంలో లేము. నేను ఎవరి భూములనైనా కబ్జా చేస్తే బాధితులు ఫిర్యాదు చేస్తారు కద. నాపై ఏమైనా పిటిషన్లు వచ్చినయా. నోరు ఉన్నది కదా అని ఏది పడితే అది ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే నాలుక చీల్చుతం.

అక్షర దర్బార్: ఎమ్మెల్యేగా దోచుకున్న డబ్బుతో అరూరి రమేష్ మండలానికో గెస్ట్ హౌస్ కట్టుకున్నాడనే కడియం శ్రీహరి ఆరోపణలపై మీ కామెంట్?

అరూరి: కడియం శ్రీహరికి ఈ ఎన్నికల్లో తన కూతురు ఓడి పోతుందనే భయం పట్టుకుంది. అందుకే ఫ్రస్టేషన్ తో నాపై దుర్మార్గంగా ఆరోపణలు చేస్తున్నాడు. మేము వ్యాపారం చేసుకునేవాళ్లం. వ్యాపారం ద్వారా పోగు చేసుకున్న డబ్బుతో నా దగ్గరలో ఖర్చు పెడుతున్న. ప్రజలకు అందుబాటులో ఉండాలనే ఉద్దేశంతో గెస్ట్ హౌస్ లను కట్టడం జరిగింది. మరి ఏ వ్యాపారం లేదనే కడియం శ్రీహరికి రూ. కోట్ల విలువ చేసే ఇండ్లు, ఇతర ఆస్తులు ఎలా వచ్చాయి. ఎక్కడి నుంచి వచ్చాయి. నేను కుటుంబాన్ని కూడా పట్టించుకోకుండా ప్రజా సేవే పరమ వదిగా భావిస్తున్న. నేను మొదటి నుంచి కూడా ప్రజల కష్టసుఖాల్లో భాగస్వామినై వారి బాగోగులు కోరుకునే సేవకుడిని.

అక్షర దర్బార్: మోడీ రూపంలో దేశానికి ప్రమాదం పొంచి ఉందని, తప్పుదారిన బీజేపీకి ఓటు వేస్తే పేదల బతుకులు ఆగమవుతాయంటున్న కడియం విమర్శలపై ఏమంటారు?

అరూరి: నరేంద్ర మోడీ నాయకత్వంలో దేశం అభివృద్ధి పథంలో పయనిస్తుంది. మోడీ ప్రపంచంలోనే భారతదేశానికి గుర్తింపు తెచ్చారు. గత పదేళ్లుగా ప్రధాని మోడీ అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అమల్లోకి తెచ్చారు. బీజేపీకి అన్ని వర్గాల ప్రజల సంపూర్ణ మద్దతు ఉంది. బీజేపీపై ఎవరెన్ని ఆరోపణలు చేసినా ఈ పార్లమెంట్ ఎన్నికల్లో కూడా బీజేపీ గెలిచి దేశంలో అధికారంలోకి రాబోతుంది. మోడీ మరోసారి ప్రధాని కాబోతున్నారు. అలాగే వరంగల్ పార్లమెంటు స్థానంలో అరూరి రమేష్ దే విజయం. వరంగల్ గడ్డపై బీజేపీ జెండా ఎగరటం ఖాయం. మోడీ మూడోసారి ప్రధాని కావటాన్ని, వరంగల్ లో అరూరి రమేష్ గెలుపును ఎవరూ ఆపలేరు.

అక్షర దర్బార్: పార్లమెంట్ ఎన్నికల్లో వరంగల్ నుంచి తమ అభ్యర్థిని గెలిపిస్తే వరంగల్ నగరంలో భూగర్భ డ్రైనేజీ, ఔటర్ రింగ్ రోడ్డు నిర్మిస్తామని, మామునూరు ఎయిర్ పోర్టు పునరుద్ధరిస్తామని తదితర హామీలు కాంగ్రెస్ పార్టీ ఇస్తుంది. వీటిపై మీ స్పందన?

అరూరి: కొద్ది నెలల కిందట జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అనేక హామీలు ఇచ్చింది. వాటిలో రైతులకు రుణమాఫీ చేయలే. ధాన్యానికి క్వింటాల్ కు రూ.500 బోనస్, మహిళలకు నెల నెల రూ.2,500 అమల్లోకి తేలేదు. వృద్ధాప్య పింఛన్లు పెంచలే. ఇలా చెప్పుకుంటూ పోతే చాలా ఉన్నాయి. అధికారంలోకి వచ్చేందుకు కాంగ్రెస్ పార్టీ ఎన్నో హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేసింది. ప్రజలు దీన్ని గమనించారు. మళ్లీ కాంగ్రెస్ పార్టీ హామీలకు మోసపోయి ఈ ఎన్నికల్లో ఆ పార్టీకి ఓటు వేయడానికి సిద్ధంగా లేరు. ప్రస్తుతం కాంగ్రెస్ ఏదైతే చెబుతుందో అవి చేయడం బీజేపీకి మాత్రమే సాధ్యం. అందుకే ప్రజలు బీజేపీని గెలిపించడానికి సిద్ధం అయ్యారు.

అక్షర దర్బార్: ఓటమి భయంతో అరూరి రమేష్ తనపై నాన్ లోకల్, ఎస్సీ కాదని ఆరోపిస్తున్నారంటున్న కాంగ్రెస్ అభ్యర్థిని కడియం కావ్య ఆరోపణలపై ఏమంటారు?

అరూరి: ఏపీలోని గుంటూరు జిల్లాకు చెందిన వ్యక్తితో ఆమెకు వివాహం జరిగింది. అందుకే ఆమె నాన్ లోకల్ అన్నాను. నేను లోకల్. స్థానికుడినైన తనకు ఓటు వేసి గెలిపించాలని వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ ప్రజలను కోరుతున్న. ఇక కులం విషయం కడియంపై ఆరోపణలు, విమర్శలు ఉన్నది అందరికి తెలిసిందే.

ఇద్దరు దొంగల అరెస్టు

అక్షర దర్బార్, వరంగల్ ప్రతినిధి : ఆటోలు, బైక్ లు చోరీకి పాల్పడిన ఇద్దరి నిందితులను మట్టెవాడ పోలీసులు అరెస్టు చేశారు. వరంగల్ ఏసీపీ నందిరాం నాయక్ వివరాల ప్రకారం.. కొత్తవాడ తుమ్మలకుంటకు చెందిన మహమ్మద్ సాదిక్, కొంక కిరణ్, గున్న అలియాస్ రాకేష్ అనే ముగ్గురు వ్యక్తులు తాగుడుకు, జల్సాలకు అలవాటుపడి అందుకు కావాలసిన డబ్బుల కోసం వరంగల్ పరిసర ప్రాంతంలో పార్కింగ్ చేసిన ఆటో, బైకులను వరుసగా దొంగతనాలు చేశారు. మంగళవారం వాహనాలు తనిఖీలు చేస్తున్న క్రమంలో ఇద్దరు పట్టుబడగా వీరిని రిమాండుకు తరలించారు. రాకేష్ అలియాస్ గున్న పరారీలో ఉన్నాడు. పట్టుబడిన వ్యక్తుల నుంచి 3 ఆటోలు, ఒక బైక్ ను పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు ఏసీపీ వివరించారు. వీరిని పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన మట్టెవాడ సీఐ టి.గోపి, ఎస్సై కే. కుమార్, లచ్చయ్య, చంద్రమౌళి, క్రైమ్ టీం కానిస్టేబుల్స్ హరికాంత్, అలీ, తిరుపతిని ఏసీపీ అభినందించారు.

మాట్లాడుతున్న రిటర్నింగ్ అధికారి ప్రావీణ్య

ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణ

రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ పి. ప్రావీణ్య

అక్షర దర్బార్, వరంగల్ ప్రతినిధి : పార్లమెంట్ ఎన్నికలను కేంద్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు స్వేచ్ఛాయుత, ప్రశాంత, పారదర్శక వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని వరంగల్ పార్లమెంటు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ పి. ప్రావీణ్య పేర్కొన్నారు. మంగళవారం వరంగల్ కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన విలేకరుల సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ బరిలో ఉన్న అభ్యర్థుల గుర్తులు ఇప్పటికే కేటాయించామన్నారు. వరంగల్ పార్లమెంట్ పరిధిలో మొత్తం 18,24,466 మంది ఓటర్లు, 1,026 మంది సర్వీస్ ఓటర్లు ఉన్నారన్నారు. 247 సమస్యాత్మక కేంద్రాలను గుర్తించామని, 1309 పోలింగ్ కేంద్రాలలో లైవ్ లైవ్ వెబ్ కాస్టింగ్, 397 పోలింగ్ కేంద్రాల బయట సీసీ టీవీ కవరేజ్, 497 మైక్రో అబ్జర్వర్లు, అధిక భద్రత సిబ్బంది ద్వారా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. సీపీ అంబర్ కిషోర్ ఝా మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికలు సజావుగా జరిగేందుకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. పోలీస్ సిబ్బందికి శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. ఎన్నికలు జరిగే ప్రాంతాల్లో వెబ్ కాస్టింగ్ నిర్వహిస్తారన్నారు. పోలింగ్ కేంద్రాల పరిసర ప్రాంతాలలో నిరంతరం సీసీ కెమెరాల నిఘా, ప్రత్యేక సాయుధ బలగాల పహారా ఉంటుందన్నారు. సమావేశంలో సహాయ ఆర్వో, డీఆర్వో శ్రీనివాస్, జిల్లా పౌర సంబంధాల అధికారి ఆయుబ్ అలీ, ఎన్నికల పర్యవేక్షకులు విశ్వనారాయణ పాల్గొన్నారు.

నర్సంపేట సొసైటీ చైర్మన్
రమణారెడ్డికి సన్మానం

అక్షర దర్బార్, నర్సంపేట : నర్సంపేట సహకార సొసైటీ చైర్మన్ గా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన బొబ్బాల రమణారెడ్డిని నర్సంపేట కాంగ్రెస్ పార్టీ ఆఫీసులో నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు కీసరి అజయ్, మండల ఉపాధ్యక్షుడు వేముల నవీన్ గౌడ్ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నర్సంపేట మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బానోతు లక్ష్మణ్ నాయక్, మాజీ సొసైటీ చైర్మన్ గుజ్జుల మాధవ రెడ్డి, ముగ్ధంపురం ఎంపీటీసీ చీకటి ఓదెలు, మాజీ ఎంపీటీసీ శంకర్ నాయక్, పెండ్యాల రాజు, మాజీ సొసైటీ డైరెక్టర్ చిదురాల రామ్ రెడ్డి, మహేందర్ రెడ్డి, నూనె నర్సయ్య, రమేష్, మాత్రు రాథోడ్, రాజు, వినయ్, గోపు మహేందర్ రెడ్డి, మల్లయ్య, మధు, గంధం జగన్మోహన్ రావు, దేశి సాయి పటేల్ తదితరులు పాల్గొన్నారు.

రమణారెడ్డిని సన్మానిస్తున్న సొసైటీ డైరెక్టర్లు

తూనికల కొలతల
అధికారుల తనిఖీలు

అక్షర దర్బార్, వరంగల్ ప్రతినిధి : వరంగల్ నగరంలో తూనికల కొలతల అధికారులు మంగళవారం తనిఖీలు చేశారు. విషయం తెలుసుకున్న దుకాణదారులు అప్రకటిత బంద్ పాటించారు. డాల్ఫిన్ గల్లీలోకి అధికారులు వచ్చిన విషయం తెలుసుకున్న నిర్వాహకులు దుకాణాలను మూసివేసి వెళ్లిపోయారు. అధికారులు కొన్ని దుకాణదారులకు రూ.పదివేలకు పైగా జరిమానా విధించారు.

కాంగ్రెస్ లో చేరిన నాయకులతో ఎమ్మెల్యే దొంతి

సబ్బండ వర్గాలకు
కాంగ్రెస్‌తోనే న్యాయం

నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి

నెక్కొండలో కాంగ్రెస్ పార్టీలో చేరిన ముస్లింలు

అక్షర దర్బార్, నెక్కొండ : కాంగ్రెస్ పార్టీతోనే సబ్బండ వర్గాలకు న్యాయం జరుగుతుందని నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అన్నారు. మంగళవారం నెక్కొండ మండల కేంద్రంలో వివిధ పార్టీలకు చెందిన ముస్లింలు నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారికి కాంగ్రెస్ కండువాలు కప్పి సాధారణంగా ఆహ్వానించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను నెరవేరుస్తుందన్న నమ్మకంతోనే నర్సంపేట నియోజకవర్గం వ్యాప్తంగా పెద్ద సంఖ్యలో పార్టీలో చేరుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు సొంటిరెడ్డి రంజిత్ రెడ్డి, మండలాధ్యక్షుడు బక్కి అశోక్, పట్టణ అధ్యక్షులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మృతురాలి కుటుంబానికి పరామర్శ

అక్షర దర్బార్, చెన్నారావుపేట: రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వారి కుటుంబ సభ్యులను నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి మంగళవారం పరామర్శించారు. మండలంలోని జల్లి గ్రామానికి చెందిన దివంగత కాంగ్రెస్ నాయకుడు తొగరు గోవర్ధన్ రెడ్డి భార్య విజయ మంగళవారం రోడ్డు ప్రమాదంలో మృతిచెందారు. కాగా, ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి మృతురాలి కుమారుడు చెన్నారెడ్డిని ఓదార్చి ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట నియోజకవర్గ నాయకులు, తదితరులు పాల్గొన్నారు..

సుధీర్ కుమార్ ను భారీ
మెజారిటీతో గెలిపించాలి

పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి

అక్షర దర్బార్, పరకాల : వరంగల్ పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి డాక్టర్ మారేపల్లి సుధీర్ కుమార్ ను భారీ మెజారిటీతో గెలిపించాలని పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం మండలంలోని అలియాబాద్, పోచారం, వెల్లంపల్లి, కామారెడ్డిపల్లి గ్రామాల్లో బీఆర్ఎస్ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే చల్లా మాట్లాడుతూ బీఆర్ఎస్ అభ్యర్థి గెలుపు కోసం ప్రతి కార్యకర్త సైనికుడిలా పని చేయాలని కోరారు. కార్యక్రమంలో పరకాల జెడ్పీటీసీ సిలువేరు మొగిలి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు చింతిరెడ్డి మధుసూదన్ రెడ్డి, యూత్ అధ్యక్షుడు శాతరాశి సనత్ కుమార్ పటేల్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి

రోడ్డు పనులను
అడ్డుకున్న రైతులు

అక్షర దర్బార్, వరంగల్: ఖిలావరంగల్ తూర్పుకోటలో ఇన్నర్ రింగ్ రోడ్డు భూనిర్వాసితులు మంగళవారం ఆందోళనకు దిగారు. తమ భూమిలో నుంచి రోడ్డు వెయ్యొద్దంటూ రైతులు పనులను అడ్డుకున్నారు. నష్టపరిహారం చెల్లించే దాక పనులను ప్రారంభించొద్దని వారు డిమాండ్ చేశారు.

విద్యార్థులను అభినందిస్తున్న ఆదర్శవాణి పాఠశాల యాజమాన్యం

అభ్యాస్ స్కూల్ విద్యార్థులను అభినందిస్తున్న కరస్పాండెంట్ స్వాతి

శ్రీ ఆదర్శవాణి విద్యార్థుల ప్రభంజనం

అక్షర దర్బార్, దుగ్గొండి : పదో తరగతి పరీక్ష ఫలితాల్లో దుగ్గొండి మండల కేంద్రంలోని శ్రీ ఆదర్శవాణి విద్యార్థులు ప్రభంజన సృష్టించారు. పాఠశాలకు చెందిన విద్యార్థులు బొల్లపెల్లి వైష్ణవి, ఏకాంబ అర్చన, గాదం ఐషు 10/10 జీపీఏ సాధించగా, నిఖిల్ సాయి నవత సంకీర్తన ప్రియ వర్షిని గ్రీష్మిత వర్ష జస్వంత నాగరాజు మణికంఠ సాయి 9/10 జీపీఏ సాధించినట్లు చైర్మన్ నాగనబోయిన రవి తెలిపారు. విద్యార్థులను సన్మానించారు. కార్యక్రమంలో డైరెక్టర్ బుచ్చన్న, ప్రిన్సిపాల్ శశిధరచారి, సుధాకర్, రవి, ఏవో రమేష్, ఇటుకల దేవేందర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'అభ్యాస్' విజయకేతనం

అక్షర దర్బార్, నర్సంపేట : పదో తరగతి పరీక్ష ఫలితాల్లో నర్సంపేట శ్రీ అభ్యాస్ హై స్కూల్ విద్యార్థులు 100శాతం ఉత్తీర్ణత సాధించారు. 9.5 జీపీఏతో పుప్పాల చరణ్ మొదటి స్థానంలో నిలవగా, 9.3 జీపీఏతో గుంటి ఉదయ్ కిరణ్ ద్వితీయ స్థానం సాధించినట్లు పాఠశాల చైర్మన్ నరహరి రాజేందర్ రెడ్డి, కరస్పాండెంట్ స్వాతి తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను వారు అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గురుకుల విద్యార్థి ప్రతిభ

అక్షర దర్బార్, పరకాల : పరకాల పట్టణానికి చెందిన పోచంపల్లి కీర్త్ పదో తరగతి పరీక్ష ఫలితాల్లో ప్రతిభ చూపి 10 జీపీఏ సాధించాడు. కరీంనగర్ జిల్లాలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో పదో తరగతి చదివిన కీర్త్ అత్యుత్తమ ఫలితాలు సాధించడంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు. కాగా కీర్త్ తల్లిదండ్రులు రాజ్ కుమార్, ప్రియాంకను ఉపాధ్యాయులు అభినందించారు.

విద్యతోనే సమాజంలో గుర్తింపు

బాలాజీ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ రాజేంద్రప్రసాద్ రెడ్డి

అక్షర దర్బార్, నర్సంపేట టౌన్ : విద్యతోనే సమాజంలో మంచి గుర్తింపు లభిస్తుందని బాలాజీ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ రాజేంద్ర ప్రసాద్ రెడ్డి అన్నారు. మంగళవారం నర్సంపేట పట్టణంలోని బాలాజీ డిగ్రీ కళాశాలలో సిగ్నేచర్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ మోర్తాల రామ్ రాజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో బాలాజీ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ రాజేంద్ర ప్రసాద్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు సన్మార్గంలో పయనిస్తూ వినయంతో కూడిన విద్యను అభ్యసిస్తేనే ఉన్నత స్థానం చేరుకుంటారని సూచించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులను విద్యార్థులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అధ్యాపకులు బోనగాని రవీందర్, రవికుమార్, భిక్షపతి, రవీందర్, ప్రభాకర్, శేషు పాల్గొన్నారు.

ప్రిన్సిపాల్ రామరాజును సన్మానిస్తున్న విద్యార్థులు

ఎంజేపీటీ విద్యార్థి విష్ణుకు 10జీపీఏ

అక్షర దర్బార్, దుగ్గొండి : గిర్నిబాయి మహాత్మ జ్యోతిరావు పూలే బీసీ సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థి మంగ విష్ణు పదో తరగతి ఫలితాల్లో 10 జీపీఏ సాధించాడు. కాగా విష్ణు, ఆయన తల్లిదండ్రులను గురుకులం ప్రత్యేక అధికారి దేవేందర్ బైరెడ్డి రాజేందర్ రెడ్డి అభినందించారు.

నడికూడ మండల టాపర్ గా ఇందు

అక్షర దర్బార్, పరకాల : పదో తరగతి పరీక్ష ఫలితాల్లో నడికూడ ఉన్నత పాఠశాల విద్యార్థి మామిడి ఇందు 9.5 జీపీఏ సాధించి మండల టాపర్ గా నిలిచింది. కంఠాత్మకూర్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థిని అక్షయ 9 జీపీఏ, వర్షిత్ కుమార్ 9, జీపీఏ, రాయపర్తి పాఠశాలలో అక్షయనందు 8.8 జీపీఏ సాధించారు. వీరిని హెచ్ ఎం హనుమంత రావు, వేణుగోపాల స్వామి, శోభారాణి, పీఆర్టీయూ నడికూడ మండల అధ్యక్షుడు అచ్చ సుదర్శన్, ప్రధాన కార్యదర్శి సతీష్ అభినందించారు.

అక్షర దర్బార్
voice of the people
తెలుగు దినపత్రిక

దళిత, ఓబీసీ రిజర్వేషన్ల

రద్దు ప్రసక్తే లేదు..

- మార్ఫింగ్ వీడియో చేసిన వారిని వదిలేది లేదు
- ఓటమి భయంతోనే కాంగ్రెస్ కుట్రలు
- రాజ్యాంగాన్ని పదే పదే సవరించింది ఆ పార్టీనే
- జహీరాబాద్ బహిరంగ సభలో ప్రధాని నరేంద్ర మోడీ

అక్షర దర్బార్, జహీరాబాద్ : దళిత, ఓబీసీల రిజర్వేషన్లు రద్దు చేసే ప్రసక్తే లేదని ప్రధాని నరేంద్ర మోడీ స్పష్టం చేశారు. బీజేపీ మరోసారి అధికారంలోకి వస్తే బీసీ, ఎస్టీ, ఎస్సీ, ఓబీసీ రిజర్వేషన్లు రద్దు చేసి.. భారతదేశాన్ని రిజర్వేషన్ రహిత దేశంగా మార్చాలని కుట్ర చేస్తోందని కాంగ్రెస్ ఆరోపణలపై ప్రధాని మోడీ స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం తెలంగాణలో పర్యటిస్తోన్న మోడీ.. జహీరాబాద్ లోక్ సభ సెగ్మెంట్ పరిధిలోని అల్లాదుర్గం వద్ద ఏర్పాటు చేసిన బహిరంగసభకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తాను బతికి ఉన్నంతవరకూ రాజ్యాంగాన్ని కాపాడుతానన్నారు. రాజ్యాంగం కల్పించిన దళిత, ఓబీసీల రిజర్వేషన్లకు తాను కట్టుబడి ఉంటానని, రాజ్యాంగ వ్యతిరేకమైన ముస్లిం రిజర్వేషన్లు అమలయ్యే ప్రసక్తే లేదని మోడీ సెన్సేషనల్ కామెంట్స్ చేశారు. రాజ్యాంగంపై మోడీని శంకించే వ్యక్తులను దేశ ప్రజలు గమనిస్తున్నారని హెచ్చరించారు. రాజ్యాంగాన్ని పదే పదే సవరణలు చేసింది కాంగ్రెస్ పార్టీనేని దుయ్యబట్టారు. రాజ్యాంగమే ధర్మ గ్రంథమని తేల్చి చెప్పిన ప్రధాని.. తాను గుజరాత్ సీఎంగా ఉన్నప్పుడు రాజ్యాంగాన్ని ఏనుగు పై ఊరేగించానని గుర్తు చేశారు. ఏనుగు అంబారీపై రాజ్యాంగం వెళ్తుంటే తాను కింద నడుచుకుంటూ వెళ్లానని చెప్పారు. పార్లమెంట్‌లో అడుగుపెట్టిన రోజే రాజ్యాంగానికి కట్టుబడ్డానని పేర్కొన్నారు. రాజ్యాంగం నాకు భారతం, రామాయణం, బైబిల్, ఖురాన్‌తో సమానమని మోడీ స్పష్టం చేశారు. మూడోసారి అధికారంలోకి వచ్చాక 75వ రిపబ్లిక్ డే ఉత్సవాలను ఘనంగా నిర్వహించి.. కాంగ్రెస్ నిజస్వరూపాన్ని బట్టబయలు చేస్తామని ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. పార్లమెంట్ ఎన్నికల వేళ కాంగ్రెస్ నేతలు బీజేపీ రిజర్వేషన్లు రద్దు చేస్తుందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా మార్ఫింగ్ వీడియోను అప్ లోడ్ చేసిందని, దీనిపై దేశ వ్యాప్తంగా చర్చ నడుస్తోంది.. మార్ఫింగ్ వీడియోను రిలీజ్ చేసినందుకు సీఎం రేవంత్ రెడ్డితో పాటు.. పలువురికి ఢిల్లీ పోలీసులు నోటీసులు జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ వ్యవహారంపై భారత ప్రధాని నరేంద్ర మోడీ సీరియస్ అయ్యారు. ఫేక్ వీడియోలను విడుదల చేసిన వాళ్లను వదిలే ప్రసక్తే లేదని ప్రధాని హెచ్చరించారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి డిపాజిట్లు కూడా రావని తెలిసుకున్న ఆ పార్టీ నేతలు రిజర్వేషన్లపై మార్ఫింగ్ వీడియోలు, రాజ్యాంగంలో మార్పులు వంటి విషయాల్లో ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు యత్నిస్తున్నారని విమర్శించారు.

రిజర్వేషన్ల రద్దుకు

బీజేపీ కుట్ర

అక్షర దర్బార్, వరంగల్ ప్రతిని : ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ రిజర్వేషన్లు రద్దుకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కుట్ర చేస్తోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆరోపించారు. వరంగల్ కు ఔటర్ రింగ్ రోడ్డు, ఎయిర్ పోర్ట్ రాకుండా ప్రధాని మోడీ అడ్డుకున్నారని, రాష్ట్ర విభజన హామీల గురించి అడిగితే తనపై అక్రమ కేసులు పెట్టాలని చూస్తున్నారని సీఎం ధ్వజమెత్తారు. లోకసభ ఎన్నికల ప్రచారంలో భాగంగా భూపాలపల్లి నియోజకవర్గం రేగొండలో మంగళవారం నిర్వహించిన జనజాతర సభలో పాల్గొన్న ముఖ్యమంత్రి బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలపై ఫైర్ అయ్యారు. రిజర్వేషన్ల రద్దు కోసమే 400సీట్లలో గెలిపించాలని బీజేపీ అడుగుతోందని విమర్శించారు. విభజన అంశాలను ప్రస్తావించినందుకే గాంధీ భవన్ కు మోడీ, అమిత్ షా ఢిల్లీ పోలీసులను పంపించారని రేవంత్ రెడ్డి మండిపడ్డారు. గుజరాత్ పెత్తనమా.. తెలంగాణ పౌరుషమా తేల్చుకుందామని సవాల్ విసిరారు. పదేళ్లు అధికారంలో బీఆర్ఎస్ ఉన్నా జయశంకర్ గ్రామాన్ని రెవెన్యూ విలేజ్ గా మార్చడంలో విఫలమయ్యారని దుయ్యబట్టారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఆ గ్రామాన్ని రెవెన్యూ విలేజ్ గా మార్చి మా చిత్తశుద్ధిని చాటుకున్నామన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపుతో కార్యకర్తల బాధ్యత పూర్తికాలేదు.. జరగబోయే ఫైనల్స్ లో మోడీని ఓడించి కాంగ్రెస్ జెండా ఎగరేయాలని పిలుపునిచ్చారు. కేసీఆర్ అక్రమ అరెస్టు చేసినట్లే మోడీ కూడా అదే పద్ధతి అవలంభిస్తున్నారని విమర్శించారు. బీసీ జనగణన చేపట్టి రిజర్వేషన్లు పెంచాలని కాంగ్రెస్ నిర్ణయం తీసుకుందన్నారు. ఈ ఎన్నికలు గుజరాత్ పెత్తనానికి.. తెలంగాణ పౌరుషానికి మధ్య జరుగుతున్న ఎన్నికలన్నారు. రజాకార్లను తరిమికొట్టిన చరిత్ర తెలంగాణ ప్రజలదని గుర్తుచేశారు. 12 సీట్లు ఇస్తే హంగ్ వస్తుందని.. నామా నాగేశ్వరరావు మంత్రి అవుతారని కేసీఆర్ అంటున్నారంటే ఆ పార్టీ బీజేపీతో కలిసిన విషయం స్పష్టమవుతోందని విమర్శించారు. ఇండియా కూటమిలో కేసీఆర్ ను చేర్చుకునే ప్రసక్తే లేదన్నారు. బీజేపీతో బీఆర్ఎస్ చీకటి ఒప్పందం చేసుకుందని, ఎన్నికల తర్వాత బీజేపీతో కేసీఆర్ పొత్తు పెట్టుకోబోతున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్ కు ఒక్క ఓటు వేసినా అది మురిగిపోతుందని పేర్కొన్నారు. కారు కార్ఖానాకు పోయింది.. ఇక దాన్ని జుమ్మేరాత్ బజారులో తూకానికి అమ్మాల్సిందేనని ఎద్దేవా చేశారు. కడియం కావ్యను రెండు లక్షల మెజారిటీతో గెలిపించాలని ప్రజలను కోరారు. వరంగల్ ను అన్ని రకాలుగా అభివృద్ధి చేసే బాధ్యత తనదేనని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, ఎంపీ అభ్యర్థిని కడియం కావ్య తదితరులు పాల్గొన్నారు.

- వరంగల్ కు ఓఆర్ఆర్, ఎయిర్ పోర్టు రాకుండా అడ్డుకున్నది మోడీనే
- విభజన హామీలు ప్రస్తావించినందుకే నాపై అక్రమ కేసులకు యత్నం
- గుజరాత్ పెత్తనమా.. తెలంగాణ పౌరుషమా తేల్చుకుందాం..
- బీఆర్ఎస్ కు ఓటేస్తే మురిగిపోయినట్టే..
- రేగొండ జన జాతర సభలో సీఎం రేవంత్ రెడ్డి

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం

అక్షర దర్బార్, ములుగు : ములుగు జిల్లాలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం చెందారు. పస్రా–తాడ్వాయి మధ్యలో 163వ జాతీయ రహదారిపై గుర్తు తెలియని వాహనం స్కూటీని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరు మృతి చెందారు. మరోకరి పరిస్థితి విషమంగా ఉంది. ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.



పేద విద్యార్థులకు

ఆర్థిక సాయం

వంశీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చేయూత

అక్షర దర్బార్, వరంగల్ ప్రతినిధి : ఉన్నత చదువులు చదువుతున్న పేద విద్యార్థులకు వంశీ ఫౌండేషన్ ఆర్థిక సహాయం చేసింది. వరంగల్ కు చెందిన రామి రెడ్డి, లక్ష్మణ్ రెడ్డి కవల పిల్లలు. వీరి తండ్రి ఓ ప్రమాదంలో తీవ్రంగా గాయపడి అచేతన స్తితిలో ఉండిపోయారు. లక్ష్మణ్ రెడ్డి వరంగల్ నిట్ లో, రామిరెడ్డి కేరళలో ఉన్నత చదువులు చదువుకుంటున్నారు. వీరి ఆర్థిక పరిస్థితి ఇబ్బందిగా ఉందని తెలుసుకున్న ఫౌండేషన్ ఫౌండర్ మురళీధర్ రెడ్డి ఇద్దరికీ మూడున్నర లక్షల చెక్కులను అందించారు. మడికొండలో జరిగిన కార్యక్రమంలో కో ఫౌండర్స్ వంశీధర్ రెడ్డి, శ్రీధర్ రెడ్డి, రామ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.